

జెసిగా ప్రవీణ్ ఆదిత్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సివి.ప్రవీణ్ ఆదిత్య బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జిల్లా జెసిగా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బదిలీపై వచ్చిన ప్రవీణ్ ఆదిత్య జెసిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఆర్‌డిఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీలార్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించిన జెసి

జాయింట్ కలెక్టర్‌గా సివి.ప్రవీణ్ ఆదిత్య బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాజీ ఎంఎల్‌ఎ శివ రూటెటు..?

కుదిరితే వైసిపి.. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి

ఇప్పటికే శివ కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీల తొలగింపు

కంచుకోటలో టిడిపికి ఎదురు దెబ్బేనా..!

రసవత్తరంగా ఉండి రాజకీయం



ప్రజాశక్తి - భీమవరం

టిడిపికి కంచుకోటగా పేరొందిన ఉండి నియోజకవర్గంలో ఆ పార్టీకి ఈసారి ఎదురుదెబ్బ తగలనుందా.. మాజీ ఎంఎల్‌ఎ వేటుకురి వెంకట శివరామ రాజు వైసిపి నుంచి పోటీ చేస్తారా.. లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. అసలు శివరామరాజు ఏ మేరకు ప్రభావం చూపుతారు.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే టిడిపి, వైసిపిల్లో ఎవరికి నష్టం అనే అంశాలపై జిల్లాలోనే విస్తృత చర్చ సాగుతోంది. ఇప్పటికే శివరామరాజు తన కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించడం, ఆపై వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని ప్రకటించంతో ఉండి రాజకీయం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. టిడిపి ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గంలో ఒక్కసారి మినహా మిగిలిన ఆరుసార్లు టిడిపినే గెలుపొందింది. శివ తిరుగుబావుటాతో ఈసారి కంచుకోటలో టిడిపికి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 2009, 2014ల్లో టిడిపి ఎంఎల్‌ఎగా గెలుపొందిన శివ 2019లో అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. రామరాజు, శివల మధ్య తొలుత మంచి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ కాలక్రమంలో ఇరువురి మధ్య దూరం పెరిగింది. దీంతో వేర్వేరు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగడంతో టిడిపి శ్రేణుల్లోనూ ఒకింత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలోనే టిడిపికి చెందిన పలువురు వైసిపి గూటికి చేరారు. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకే మరోసారి టిక్కెట్ ప్రకటించ డంతో శివ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బహిరంగం గానే అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శివరామరాజు టిడిపికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు, వైసిపిలో చేరుతున్నట్లు ప్రచారం సాగింది. అయితే తాను వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేస్తానని, ఏ పార్టీ తరపున అనేది శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రకటిస్తాననడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. శివ వైసిపి నుంచి పోటీ చేస్తారా లేక టిడిపి రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటారా అనే దానిపై చర్చ పెద్దఎత్తున సాగుతోంది. ఇప్పటికే వైసిపి అధిష్టానం సూచన మేరకు జిల్లాకు చెందిన కొంతమంది నేతలు శివరామరాజుతో మంతనాలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే వాస్తవమైతే డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నర్సింహరాజు పరిస్థితి ప్రశ్నార్థకమవుతోంది. పదేళ్లుగా పార్టీని ముందుకు నడిపిస్తున్న పివిఎల్ వచ్చే ఎన్నికల్లో తానే బరిలో ఉంటానని ఇటీవల ప్రకటించారు. ఏదేమైనా శివరామరాజు బరిలో నిలిస్తే టిడిపికే ఎక్కువ నష్టం చేకూరుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. శివ అడుగులు ఎటువైపు అనేది శనివారం సాయంత్రం వరకూ వేచిచూడాల్సిందే.

పోటీలో ఉంటా.. ఏ పార్టీ అనేది త్వరలో ప్రకటిస్తా

ఉండి మాజీ ఎంఎల్‌ఎ వి.శివరామరాజు

కాళ్ల : వచ్చే ఎన్నికల్లో తాను ఉండి నియోజకవర్గం నుంచే పోటీలో ఉంటానని మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) స్పష్టం చేశారు. భీమవరంలోని శివరామరాజు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా శివ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలందిస్తూ 2009, 2014 ఎన్నికల్లో ఉండి ఎంఎల్‌ఎగా టిడిపి తరపున గెలుపొందానని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు తాను నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యాయన్నారు. తాను ఎంతో కష్టపడి పేరు తెచ్చుకున్నానని, ఆ విషయం తెలిసి కూడా టిడిపి అధిష్టానం తనకు టిక్కెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. కనీసం తనతో సంప్రదించకుండానే సిట్టింగ్ ఎంఎల్‌ఎను అభ్యర్థిగా ప్రకటించడం కలిచివేసిందన్నారు. తాను పోటీలో ఉండాలని నియోజకవర్గంలో ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దీని దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చానని తెలిపారు. ఏ పార్టీ తరపున పోటీ చేస్తాననేది త్వరలోనే తెలియజేస్తానన్నారు.

భీమవరం జనసేన అభ్యర్థిగా అంజిబాబు

టిడిపి, జనసేన శ్రేణులతో పట్టణంలో ర్యాలీ

పవన్‌కళ్యాణ్ ఇక్కడి నుంచి పోటీలో లేనట్లే



ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో బరిలోకి దిగే జనసేన అభ్యర్థిపై ఎట్టకేలకు స్పష్టత లభించింది. ఇక్కడి నుంచి మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పోటీ చేయనున్నారు. అయితే మొదటి నుంచి ఇక్కడ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని ప్రచారం సాగుతున్నప్పటికీ మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో పవన్ ఇక్కడ నుంచి పోటీ చేయడం లేదని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు మంగళవారం జనసేనలో చేఇరన సంగతి తెలిసిందే. ఒకరోజు వ్యవధిలోనే అంజిబాబుకు జనసేన అధిష్టానం నుంచి బుధవారం పిలుపు రావడంతో మంగళగిరి వెళ్లారు. ఆయనకు టికెట్ కేటాయిస్తున్నట్లు పవన్ స్పష్టత ఇచ్చారు. దీంతో మంగళగిరి నుంచి తిరిగొస్తున్న అంజిబాబుకు కృష్ణా జిల్లా సరిహద్దు ప్రాంతమైన లోసరి వద్ద టిడిపి, జనసేన శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడ నుంచి డిఎన్ఆర్ కళాశాల రోడ్డు మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి అంజిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. భీమవరం టిక్కెట్ ఇస్తున్నట్లు అధినేత పవన్ తనతో చెప్పారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి పవన్ కళ్యాణ్‌కు కానుకగా ఇస్తానని చెప్పారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట వీరవాసరం జెడ్‌పిటిసి గుండా జయ ప్రకాష్ నాయుడు, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెం నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ రంగంలోకి దిగనున్నారు. మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో బొలిశెట్టి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్ బొలిశెట్టి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ సీల్డ్ కవర్ అందించారు. బొలిశెట్టి శ్రీనివాస్ తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేశారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచి గణనీయమైన ఓట్లు సాధించారు.

బుధవారం రాత్రికి తాడేపల్లిగూడెం చేరుకున్న బొలిశెట్టికి జనసైనికులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు ఆకాంక్షించే కూటమిగా ప్రజల్లోకి వస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తొలుత హౌసింగ్ బోర్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన నివాసం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలు ఒక యుద్ధంలా భావించి రాక్షస వైసిపిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు.

నరసాపురం జనసేన అభ్యర్థిగా నాయకర్..!

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం. బుధవారం మంగళగిరి కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ నాయకర్‌తో మాట్లాడి అనంతరం సీల్డ్‌కవర్ అందజేయడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన నాయకర్ వైసిపి అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. నాటి నుంచి పార్టీని వీడకుండా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నాయకర్‌కే టిక్కెట్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో చేరారు. దీంతో టిక్కెట్ విషయంలో సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది. బొమ్మిడి నాయకర్ అభ్యర్థిత్వం ఖరారైనట్లు తెలియనేగా జనసైనికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయం నుండి పంజా సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు.



సీల్డ్ కవర్‌తో నాయకర్

తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా వీరవాసరం వాసి

ప్రజాశక్తి - వీరవాసరం



వీరవల్లి కనకరత్నం

వీరవాసరం గ్రామం నుండి అనేక మంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, న్యాయ శాఖల్లో ఉన్నత స్థానాల్లో ఉండి గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్నారు. ఇదే కోవలో వీరవాసరం గ్రామానికి చెందిన వీరవల్లి కనకరత్నం తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా నియమితులయ్యారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కనకర్నతం ప్రాథమిక, ఉన్నత విద్య వీరవాసరంలోని మండల పరిషత్, ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాగింది. ఇంజినీరింగ్ విద్య వీరవాసరం ఎంఆర్‌కె పాలిటెక్నిక్, భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సాగింది. ఎపిపిఎస్‌సి ద్వారా జోన్-6 నుండి ఎఇఇగా నియమితులు కావడంతో అప్పటి నుండి తెలంగాణ కేడర్లో కొనసాగుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లో ఎఇఇగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన కనకరత్నం అదే జిల్లా అచ్చంపేట సబ్‌డివిజన్ డిఇఇగా, మెదక్ సబ్‌డివిజన్ ఇఇగా, నిజామబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, వనపర్తి డివిజన్‌ల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా, మెదక్, కరీంనగర్ సర్కిళ్లలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ జోన్‌లో విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనకరత్నంను పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయనను ఫోన్‌లో సంప్రదించగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసించిన వారు ఉన్నత స్థానాల్లో ఉంటారనడానికి తన ఎదుగుదలే నిదర్శనమన్నారు. తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన గురువులకు, గ్రామస్తులకు తాను రుణపడి ఉంటానన్నారు. తెలంగాణ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకంతో ఉత్తమ సేవలందిస్తూ పుట్టిన గడ్డకు పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తానని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికతో ముందుకు

స్పష్టమైన రాజకీయ అవగాహనతో పొత్తులు

అతిగా వ్యవహరిస్తున్న వాలంటీర్లు, డ్వాక్రా సిఎలకు బుద్ధిచెబుతాం

ఇళ్ల పట్టాలకు సొమ్ము వసూలుచేస్తే అది సంక్షేమమా?

మాజీ మంత్రి, ఆచంట టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఆచంట, పెనుగొండ

తాను గెలిచాక ఆచంట నియోజకవర్గ అభివృద్ధిపై పక్కాప్రణాళికతో ముందుకు సాగుతానని, ముందుగా మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని మాజీ మంత్రి, టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ తెలిపారు. ఆచంట నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా బరిలో ఉన్న పితాని 'ప్రజాశక్తి' బృందంతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన, వైసిపి పాలనలో నియోజవర్గంలో నెలకొన్న పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయి వంటి పలు ప్రశ్నలకు పితాని సత్యనారాయణ సమాధానాలిచ్చారు.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ప్రారంభించి ఎన్ని రోజులైంది? ప్రచారంలో ప్రజల స్పందన ఏవిధంగా ఉంది?

జనవరి 21 నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించాను. ప్రజల స్పందన చాలా బాగుంది. ఎంతో చక్కగా ఆహ్వానిస్తున్నారు. రౌడీల, అవినీతి రాజ్యం పోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రశ్న: టిడిపి, జనసేన, బిజెపి పొత్తును ప్రజలు ఏవిధంగా చూస్తున్నారు?

మూడుపార్టీల పొత్తును ప్రజల ఆహ్వానిస్తున్నారు.

ప్రశ్న: ఎన్నికల్లో గెలిస్తే నియోజకవర్గంలో ముందుగా ఏ సమస్యలను ప్రధానంగా పరిష్కరించాలని నిర్ణయించుకున్నారు?

వైసిపి ప్రభుత్వం ఆస్తులను తాకట్టు పెట్టడంతోపాటు, విపరీతంగా అప్పులు చేసిన పరిస్థితి ఉంది. చివరికి మద్యం అమ్మకాలను సైతం తాకట్టు పెట్టారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం గాడిన పడాలంటే కొంత సమయం పడుతోంది. ముందుగా మేనిఫెస్టోలో చెప్పిన సంక్షేమ పథకాలను అమలు చేస్తాం. ఆరు నెలల తర్వాత పక్కా ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధిపై ముందుకు సాగుతాం.



ప్రశ్న; జనసేన శ్రేణుల సహకారం ఏ విధంగా ఉంది?

స్పష్టమైన రాజకీయ అవగాహనతో పొత్తు ఆలోచనకు అనుగుణంగా అంతా ఒకేమాటపై టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నారు.

ప్రశ్న: పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రజలు తమవైపే ఉన్నారని మీ ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. దీన్ని మీరు ఏ విధంగా చూస్తున్నారు?

సంక్షేమం పేరుతో ఎంతమందికి అన్యాయం చేశారో అందరికీ తెలుసు. టిడిపి, జనసేన కార్యకర్తల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అందకుండా చేశారు. ఇళ్ల పట్టాలను అమ్ముకుని సంక్షేమ అనడం ఏమిటో తెలియడం లేదు. పెన్షన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితులు కొనసాగాయి. ఏడుసార్లు కరెంటు ఛార్జీలు పెంచి విద్యుత్ ఎక్కువ వాడకం జరిగింది. సంక్షేమ పథకాలు నిలిపివేశారు. ధాన్యం సొమ్ములు సకాలంలో ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతుపక్షపాతి అంటూ రైతులకు అన్యాయం చేశారు. మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలకు రూ.1400 కోట్లు ఇస్తామని రూ.వంద కోట్లు ఇచ్చారు.

ప్రశ్న; జగనన్న ఇళ్ల పట్టాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారనే విమర్శలు వచ్చాయి. దీనిపై మీరేమంటారు?

అప్పటి కలెక్టర్ ముత్యాలరాజుకు ఇళ్ల పట్టాలకు డబ్బు వసూలు చేయడంపై నేనే ఫిర్యాదు చేశాను. ఆయన నేను ఇచ్చిన ఆధారాలను గృహనిర్మాణ శాఖ మంత్రి రంగనాథరాజుకు అప్పగించారు. అధికారులు అవినీతికి అండగా నిలవడం చాలా దారుణం.

ప్రశ్న: ఈసారి గెలిస్తే అయోధ్యలంక బ్రిడ్జి పూర్తి చేసే అవకాశం ఉందా?

తప్పకుండా చేస్తాం. కొంత సమయం తీసుకుని అన్ని పనులూ పూర్తి చేస్తాం.

ప్రశ్న: నియోజకవర్గంలో ఐదేళ్ల వైసిపి పాలన ఏవిధంగా ఉందని అనుకుంటున్నారు?

వాలంటీర్లు, డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన కొంతమందిని ఉపయోగించుకుని జనాలను భయపెట్టాలని చూస్తున్నారు. వాలంటీర్లు కొంతమంది సంక్షేమ పనులు వదిలేసి జనాలను బ్లాక్‌మెయిల్ చేయడం, తండ్రీ కొడుకులకు, అన్నదమ్ముల తగవుల మధ్య తలదూర్చి వారిని భయభ్రాంతులకు గురి చేయడం వంటి పనులు చేస్తున్నారు. వాలంటీర్లను కొనసాగిస్తాం. కొంతమంది డ్వాక్రా సిఎలు, వాలంటీర్లు చేస్తున్న పనులు ఆధారాలతో దొరికితే మాత్రం వదిలిపెట్టం. ఎవరైతే పార్టీలకు అనుకూలంగా డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారో వారిని ఉపేక్షించేది లేదు. నిజాయతీగా ఉన్నవారిని గౌరవిస్తాం. సోషల్ మీడియాలోనూ వైసిపికి అనుకూలంగా ప్రచారం చేస్తున్న వారిని వదలేది లేదు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత నిబద్ధతతో వీరంతా పని చేస్తే బాగుంటుంది.

ప్రశ్న: నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటీ?

ప్రజలకు నేను చెప్పేదొక్కటే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తుకు అండగా నిలబడాలని కోరుతున్నాం.

16న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి తదుపరి శస్త్ర చికిత్స అవసరమయ్యే రోగులకు ఉచితంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ క్యాంప్ ఎస్ఎల్‌జి ఆసుపత్రి, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వసుధ ఫౌండేషన్, ఎబిఎస్‌వికె ఆధ్వర్యాన మాక్స్ విజన్ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణలో పోలింగ్ నిర్వహణ, ఇవిఎంల వినియోగం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఐటి అప్లికేషన్స్, పోస్టల్ బ్యాలెట్ అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా కలెక్టరేటు ఎఒ పి.పాపారావు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ఇవిఎంలను భద్రపర్చిన స్థానిక గొడౌన్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. నియోజకవర్గానికి సంబంధించి సెక్టారు అధికారులకు, సిబ్బందికి ఇసిఐ నిబంధనల మేరకు ఓటింగు యంత్రాలపై శిక్షణ ఇచ్చే నిమిత్తం ఒక్కో నియోజకవర్గానికి 15 ఇవిఎంల చొప్పున ఆయా నియోజకవర్గాల తహశీల్దార్లకు అందజేశారు. తొలుత పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. గొడౌన్ వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ గార్డులకు పలు సూచనలను కలెక్టర్ జారీ చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివనారాయణరెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు ఉన్నారు.

సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

సార్వత్రిక ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల ప్రవర్తనా నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉండి నియోజకవర్గ సెక్టార్ అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల పట్ల బాధ్యతతో పని చేయాల న్నారు. సెక్టార్ అధికారులు తరచూ బూత్ లెవెల్ అధికారు లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఒక్కో సెక్టార్ అధికారికి సుమారు 10 నుండి 12 పోలింగ్ స్టేషన్ల విధులను కేటాయించామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే ఉంటా

భీమవరం నుంచి నన్ను తరిమికొట్టేదెవరు

పవన్ కళ్యాణ్‌ను ప్రజలు భీమవరం నుంచి తరిమికొట్టారు

రౌడీ, గూండా అనడానికి నాపై ఎటువంటి క్రిమినల్ కేసులూ లేవు

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



ప్రజాశక్తి - భీమవరం

'భీమవరం నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను తరిమి కొట్టారు.. కృష్ణా జిల్లా నుంచి తరిమేస్తే అంజిబాబు ఇక్కడకు వచ్చారు.. నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే ఉంటా.. నన్ను తరిమి కొట్టేది ఎవరు' అని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో భీమవరం మాజీ ఎమ్మెల్యే రామాంజనేయులు జనసేనలో చేరిన సందర్భంలో పవన్ కళ్యాణ్ ఎంఎల్‌ఎపై పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. నెల రోజులు క్రితం పవన్ తనపై వ్యక్తిగత ద్వేషం లేదని చెప్పి తాజాగా గుండా, రౌడీ, భీమవరం నుంచి తనను తరిమి కొడతానని చెప్పడం చిత్రంగా ఉందన్నారు. తనపై ఎటువంటి క్రిమినల్ కేసులూ లేవని స్పష్టం చేశారు. పవన్ మానసిక స్థితి సరిగా లేదని ఆరోపించారు. పవన్‌కు స్థలం అమ్మకుండా చేశానని, భయభ్రాంతులకు గురి చేశానని చెప్పడం సిగ్గుచేటని, పవన్‌కు స్థలం కావాలంటే తనను అడిగితే ఇస్తానుగా అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో పడిగాపులు కాసి రాష్ట్ర ప్రయోజనాల కోసం పొత్తు పెట్టుకున్నానని చెబుతున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. విశాఖ ఉక్కు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పొత్తులు పెట్టుకున్నానని చెబితే ప్రజలు నమ్మేవారన్నారు. భీమవరంలో పోటీ చేసిన పవన్ ఓడిపోయిన తర్వాత తిరిగి భీమవరం వైపు చూడలేదని, కనీసం కరోనా సమయంలోనూ ఇక్కడి ప్రజల కోసం ఆలోచించలేదని విమర్శించారు.

అంజిబాబుది ఊసరవెల్లి రాజకీయం

గతంలో కాంగ్రెస్, టిడిపిల నుంచి గెలిచిన మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రస్తుతం జనసేనలో చేరారని, ఆయనది ఊసరవెల్లి రాజకీయమని విమర్శించారు. శివారు గ్రామంలో తాగునీటి ప్రాజెక్టు కోసం 50 ఎకరాలు సేకరించిన ఆయన, ఆ భూమిని తన పేరున రాయించుకుని తాగునీటి ప్రాజెక్టు గాలికొదిలేశారని, ఆ భూముల్లో చెరువులు తవ్వుకుని ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ఐదేళ్లపాటు మున్సిపల్ ఛైర్మన్‌గా, పదేళ్లు పాటు అంజిబాబు ఎంఎల్‌ఎగా పని చేశారని, ఆ సమయంలో డంపింగ్ యార్డు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. తాడేరులో డంపింగ్ యార్డు నిర్మాణానికి తాను స్థల సేకరణ చేశానని, ఇదేమి తెలుసుకోని పవన్ తాను అధికారంలోకి వచ్చాక డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా భారత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సెమీ కండక్టర్ల తయారీ విభాగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తుందని బిట్ సిలికా (హైదరాబాద్) మేనేజర్ డాక్టర్ ఎం.నాగసీతారాం తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపి నిట్)లో వికాసిత్ భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉన్న అవకాశాలు, సవాళ్ల అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులే కీలకమని చెప్పారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు భారతదేశంలో తగినన్ని లేకపోవడంతో వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. భారతదేశంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయని, భవిష్యత్తులో భారత్ సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధరలు తగ్గటంతోపాటు ఎంతోమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సెమీ కండక్టర్లను కంప్యూటర్ పరికరాలు, కంజుమర్ ఎలక్ట్రానిక్స్, వాషింగ్ మెషిన్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఆఫ్ మొబైల్ ట్రాన్స్‌పోర్ట్, మెడికల్ డివైస్, ఏరో స్పేస్ డిఫెన్స్‌లలో విరివిగా వినియోగిస్తున్నారన్నారని చెప్పారు. కమ్యూనికేషన్, ఎంబెడెడ్, చిప్ డిజైన్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలను ఎలా సాధించాలి, బీటెక్‌లో ఉండగానే స్కిల్స్‌ను ఎలా పెంపొందించుకోవాలనే విషయాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. తొలుత భారతదే శ ప్రధాని నరేంద్ర మోదీ (గుజరాత్, అస్సాం) ప్రారంభించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్ కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో ఆచార్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ శ్రీఫణీకృష్ణ, డాక్టర్ యువరాజు, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ చిరస్మరణీయులు

ప్రజాశక్తి – భీమవరం

తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ చిరస్మరణీయులని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్ధులయ్యేలా కవయిత్రి మొల్లమాంబ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జిఓ విడుదల చేసి, అధికార కార్యక్రమంగా మొల్లమాంబ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు.

మొగల్తూరు :కుమ్మరి శాలివాహనుల ఆడబడుచు, రామాయణ రచయిత, తెలుగు తొలి మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఆ సంఘ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ విగ్రహానికి సర్పంచి పడవల మేరి సత్యనారాయణ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి – మొగల్తూరు

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా నియోజకవర్గంలో తాగునీటి పథకాల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మండలంలోని శేరేపాలెంలో రూ.17.5 లక్షలతో నిర్మించే ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 37 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. అనంతరం కొత్తపాలెంలో రూ.1.44 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అదే గ్రామంలో గోగులమ్మ, వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కళావేదికను, సర్పంచి నాగలక్ష్మి మామ పేరిట రూ.3 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉప సర్పంచి ఆకన కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, నిప్పులేటి బోసు, కొత్తపల్లి నాగరాజు, బాబి, దొరబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి – నరసాపురం

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్-2, ఎకనామిక్స్ -2 పరీక్షలు బుధవారం జరిగిగియి. నరసాపురంలో ఆదిత్య, శ్రీ వైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీ సూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కరా కళాశాల్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 245 మంది విద్యార్థులకు 230 మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరయ్యారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి – పెనుగొండ

మండలంలో పలు అభివృద్ధి పనులను ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం ప్రారంభించారు. చెరుకువాడలో రూ.20 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, చిన్నంవారిపాలెంలో రూ.1.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, వడలిలో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం-1,2 భవనాలు, ఇలపర్రులో రోడ్లు, డ్రెయినేజీలు ప్రారంభించారు. కొటాలపర్రులో సచివాలయం, రజక కమ్యూనిటీ హాలు, డ్వాక్రా భవనం, రోడ్లు, డ్రెయినేజీలు ప్రారంభించారు. పెనుగొండలో కాపు కమ్యూనిటీ హాలును ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గోవర్ధన్, ఎంపిడిఒ ఎస్.శ్రీనివాస్‌దొర, తహశీల్దార్ ఆర్‌వివి.రోహిణిదేవి పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ప్రజాశక్తి – కాళ్ల

ప్రేమ వివాహం చేసుకుని రక్షణ కల్పించాలని వధూవరులు బుధవారం కాళ్ల పోలీసులను ఆశ్రయించారు. కాళ్ల గ్రామానికి చెందిన కాగిత బాలాజీ, దొడ్డనపూడి గ్రామానికి చెందిన గుండా మౌనిక బుధవారం వివాహం చేసుకుని కాళ్ల పోలీసులను ఆశ్రయించారు. వీరు కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరి సామాజిక తరగతులు వేరు కావడంతో పెద్దలు అంగీకరించరని తెలిసి వివాహం చేసుకున్నారు. వివాహం చేసుకున్న ప్రేమజంటకు యువతి కుటుంబ సభ్యుల నుంచి ప్రమాదం ఏర్పడకుండా ముందస్తుగా పోలీసులను ఆశ్రయించామన్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో చట్టప్రకారం వారి సొంత నిర్ణయం తీసుకునే హక్కు ఉండటంతో పోలీసుల సమక్షంలో వారి పెద్దలను పిలిచి మాట్లాడి వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసిపి : పితాని

ప్రజాశక్తి – ఆచంట

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి సిఎం జగన్ ధనాన్ని దుర్వినియోగం చేశారనిమాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ విమర్శించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం తథ్యమన్నారు. మండలంలోని వల్లూరులో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు నియంత్రించలేని అసమర్థ ముఖ్యమంత్రి సిఎం జగన్ అని విమర్శించారు. ఎ

యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి – పాలకొల్లు

యువత చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ సూచించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గోపీ ఆధ్వర్యంలో యువతకు బుధవారం క్రికెట్ కిట్స్, వాలీబాల్ కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా వైసిపి నరసాపురం ఎంపి అభ్యర్థి గూడూరి ఉమాబాల హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ సెక్రటరీ గుద్దా చంద్రకళ, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాల నరసయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి – తణుకు

ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు సిఎం జగన్ సిఎం రిలీఫ్ ఫండ్‌తో ఆదుకుంటున్నారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బాధిత కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందించారు. తమ కుమారుడు వైద్యానికి సహకరించిన మంత్రి కారుమూరికి రుణపడి ఉంటామని మోక్షిత్ తండ్రి నరేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర, సత్యనారాయణ పాల్గొన్నారు.

గీతాంజలి మృతిపై నిరసన

ప్రజాశక్తి – తణుకు

స్థానిక నరేంద్రసెంటర్ వద్ద గీతాంజలి మృతిపై బుధవారం నిరసన తెలిపారు. ఈ నిరసన రాష్ట్ర పౌరసరఫరాల వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. గీతాంజలి తన సంతోషాన్ని చక్కగా వివరించిందని, ఇది ఓర్వలేని టిడిపి పచ్చ దొంగలు ఆమెపై సామాజిక మాధ్యమాల్లో విషం చిమ్మడమే కాకుండా అసభ్యకరంగా పెట్టిన పోస్టులకు చలించి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఇప్పటికే సిఎం ఈ విషయంలో స్పందించి ఆమె కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయంతో పాటు అండగా నిలబడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నత్త కృష్ణవేణి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్వర్, టిడిపి ఎస్టేట్ చిరంజీవి, వైసిపి పట్టణ అధ్యక్షులు మంగిన సూర్య, బలరామకృష్ణ, పైబోయిన సత్యనారాయణ, పొట్ల సురేష్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి – నరసాపురం

నరసాపురం పురపాలక సంఘం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకట రమణ తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

బిసి వెల్ఫేర్ జెఎసి అధ్యక్షునిగా ఠాగూర్


ప్రజాశక్తి – నరసాపురం

బిసి వెల్ఫేర్ జెఎసి నరసాపురం పట్టణ అధ్యక్షునిగా పోతుమూరి వెంకట రవీంద్రనాథ్‌ఠాగూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఠాగూర్‌కు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు నియామక పత్రాన్ని మంగళగిరి కార్యాలయంలో అందించారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయండి

అధికారులకు ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆదేశం

శ్మశానవాటిక దారి ఆక్రమణపై ఫిర్యాదుతో వాండ్రంలో పర్యటన



ఉండి : విక్టర్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న సాయిజగన్నాథ్

ప్రజాశక్తి – ఉండి

శ్మశానవాటిక ఆక్రమణదారులపై వెంటనే కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వాండ్రం గ్రామంలో శ్మశానవాటిక దారిని కొంతమంది ఆక్రమించి రహదారి నిర్మిస్తున్నారని దళిత నాయకులు మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. బాలకృష్ణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విక్టర్‌ప్రసాద్ బుధవారం మండలంలోని వాండ్రంలో పర్యటించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక వెళ్లే దారిని ఆక్రమించిన వారు ఎవరైనా వెంటనే వారిపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక లేని దళితవాడలకు వారి సంఖ్యను బట్టి శ్మశానవాటికను కేటాయించి ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ కంచె వేయాలని సిఎం జగన్ జిఓ జారీ చేశారని తెలిపారు. దళితవాడకు వెళ్లేందుకు ఉన్న 18 అడుగుల రహదారిని సైతం ఆక్రమించారని విక్టర్‌ప్రసాద్ దృష్టికి దళితవాడ నాయకులు తీసుకొచ్చారు. దీంతో శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేసి దళితులకు అప్పగించాలని అధికారులను విక్టర్‌ప్రసాద్ ఆదేశించారు. శ్మశానవాటిక, రహదారి ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీనివాసరాజులును ఆదేశించారు. ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన యువకుడు మేడిద సాయి జగన్నాథ్ తమ గ్రామానికి శ్మశానవాటిక లేదని, వెంటనే కేటాయించాలని కలెక్టర్‌కు గతంలో స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోలేదని, వెంటనే తమ గ్రామంలోని దళితవాడకు శ్మశానవాటిక కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విక్టర్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. భీమవరం డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విక్టర్‌ప్రసాద్ డిఎస్‌పికి మెమో జారీ చేయాలని సిఫార్సు చేశారు. ఈ పర్యటనలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చీకటిపల్లి మంగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు, గోడి పెద్దిరాజు, మాల మహానాడు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

పాలకొల్లు : విద్య, వైద్య, గృహ రంగాలకు సిఎం జగన్ పెద్దపీట వేశారని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ చెప్పారు. పాలకొల్లులోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాటా్డారు. రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఎన్ని చట్టాలుఉన్న ఇంకా దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు వరప్రసాద్, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి ఉమాబాల, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరురాలు వరలక్ష్మి మృతి

ప్రజాశక్తి – పోడూరు

సిపిఎం సానుభూతి పరురాలు దొంగ రామలక్ష్మి మృతి బాధాకరమని పలువురు అన్నారు. రామలక్ష్మి మృతికి సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, జిన్నూరు శాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి, సీనియర్ నాయకులు తాళాబత్తుల గాంధీ, దాడి గవురమ్మ, చివటపు ఆంజనేయులు సంతాపం, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామలక్ష్మి సిపిఎం తరపున గ్రామ పంచాయతీ మెంబర్‌గా ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. ఆమెకు భర్త పుల్లయ్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

డిఇఒ వెంకటరమణ



కంప్యూటర్ కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి – కాళ్ల

విద్యార్థులకు చదువుతో పాటు సత్ప్రవర్తన ముఖ్యమని, తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు గౌరవాన్ని తెస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. ఏలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో సుమారు రూ.1.50 లక్షల విలువైన 30 కంప్యూటర్ కుర్చీలు డిఇఒ వెంకటరమణ చేతులమీదుగా అందించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ కాలేజీల్లో వినియోగించే కుర్చీలు బహుకరిస్తున్న పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, పూర్వ విద్యార్థులు మంతెన రవివర్మ, మాణిక్యాలరావు, మోహనలక్ష్మి, ప్రధానోపాధ్యా యులు జివి.సత్యనారాయణ రాజు, మంతెన రామకృష్ణంరాజు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మి, బండ్రెడి ఆది, కొండా రమణ, జేమ్స్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఉచితంగా మందులు

ప్రజాశక్తి – నరసాపురం

అనారోగ్యాలతో బాధ పడుతున్న వ్యక్తులకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతినెలా ఉచితంగా మందులు అందిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు తన నివాసంలో మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. విద్య, వైద్యానికి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రతి నెలా వ్యాధుల బారి నుంచి కోలుకునేందుకు మందులు అందిస్తున్నామన్నారు. పేదరికం వల్ల చదువులు ఆగిపోకూడదనే ఉద్దేశంతో అందరూ చదువుకుంటేనే దేశం అభివృద్ధి అవుతుందనే నమ్మకంతో అనేకమంది విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. వైద్యం చేయించుకునేందుకు, మందులు కొనుక్కునేందుకు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం ఆగకూడదని, ప్రతి నెలా అవసరమైన వారికి మందులు ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో విద్య, వైద్యానికి ఇబ్బందులు పడే ఎంతో మందిని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫౌండేషన్ సభ్యులు, రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

'ఎంఎల్ఎ నిమ్మలను గెలిపించాలి'

ప్రజాశక్తి – పోడూరు

నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడమే కాకుండా కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచేది ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అని ఆయన సతీమణి సూర్యకుమారి అన్నారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని వద్దిపర్రు గ్రామం చింతలగరువులో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలతో కలిసి వెళ్లి ప్రతి ఇంట మహిళలకు బొట్టు పెట్టి ఎంఎల్ఎ రామానాయుడును గెలిపించాలని కోరారు.

పట్టణవాసులకు పరిశుభ్రమైన తాగునీరందించాలి

నరసాపురం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు



వాటర్ వర్క్సును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి – నరసాపురం

రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని హెడ్ వాటర్ వర్క్సును, సమ్మర్ స్టోరేజీ ట్యాంకును, ఆలమ్ నిల్వలను, క్లోరిన్ గ్యాస్ సిలిండర్లను ఆయన ఇంజినీర్లతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కుళాయి చెరువులో నీటిని పూర్తిస్థాయిలో నింపాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుని పట్టణ ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం వాటర్‌వర్క్సులోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ ఆర్.రమేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ సునీల్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి – ఉండి

పేదోడి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని ఉనుదుర్రులో అర్హులైన 98 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు బుధవారం అందించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ సిఎం జగన్ జగనన్న కాలనీలను ఏర్పాటు చేయడమే కాకుండా ఉచితంగా ఆ భూమిని లబ్ధిదారులు పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

నరసాపురం :నవరత్నాలలో భాగంగా జగనన్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను రెండో వార్డులో సచివాలయం వద్ద మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ చేతులమీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ ఇల్లు అనేది ప్రతి కుటుంబం జీవిత ఆశయమన్నారు. ప్రతిఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలని నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు అందిస్తున్నామన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

మండల సమావేశంలో వైస్ ఎంపిపి సుబ్బారావు



మాట్లాడుతున్న వైస్ఎంపిపి సుబ్బారావు

ప్రజాశక్తి – మొగల్తూరు

రానున్న వేసవిలో సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు ఆ శాఖాధికారులకు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని తాగు, పశువుల చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. శాఖల వారీగా అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఇరిగేషన్ ఎఇ హరికిషన్ మాట్లాడుతూ మండలంలో ప్రతి ఎకరాకూ సాగునీరందించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ మండలంలో 1190 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారని, ప్రతి రైతు నుంచి ఇకెవైసి పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు లక్ష్మీపార్వతి, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపి-2 కవురు సీతామహాలక్ష్మి, యు.బాబ్జిరాజు, తహశీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.40 వేలు విరాళం

ప్రజాశక్తి – పాలకొల్లు

పోడూరు మండలంలోని వేడంగి గ్రామంలో హరిజనపేటలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు నిమిత్తం వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ బుధవారం రూ.40 వేలు అందించారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమబాల చేతులమీదుగా గ్రామ అధ్యక్షుడు పాలపర్తి రాముకు పాలకొల్లు వైసిపి కార్యాలయంలో నగదు అందించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుక్కల బాలచంద్ర, వైస్ ఎంపిపి కొప్పాడి శ్రీనుబాబు, నేర్స్ గాబ్రెల్, సూర్యప్రకాష్, బుంగా అచ్యుత్‌కుమార్, దిద్దే వెంకట్రావు, కుసుమే రామకష్ణ పాల్గొన్నారు.

250 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి – ఆచంట(పెనుమంట్ర)

పెనుమంట్ర గ్రామంలో శ్రీ సత్య సాయి సేవా సమితి సహకారంతో, ఒఎన్‌జిసి, దృష్టిదాన్ సంస్థ (ఢిల్లీ) ఆధ్వర్యంలో బుధవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కోయ వెంకట కార్తీక్ అధ్యక్షతన 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సుమారు 35 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారికి ఒఎన్‌జిసి రాజమండ్రి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్ ఐ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆసుపత్రిలో చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా వాసు, ఒఎన్‌జిసి ఉన్నతాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు రాగు కాశీ, వెలగల మహేందర్‌రెడ్డి, వెలగల సౌమ్య, మేడపాటి లక్ష్మి, రాధాకృష్ణ, పెనుమంట్ర గ్రామస్తులు ఆకివీటి నాగ శ్రీహరి, జవ్వాది సురేష్, బయ్యే బాలాజీ, ఆకివీటి కళ్యాణ్, గాదిరాజు రాజేష్, పట్టం సాయి, చింతా కళ్యాణ్, గంటా వీరబాబు, వానపల్లి రంగారావు, ఎర్ర రాధేగోపాలం, మిరియాల ఏసు, బోణం నరసింహమూర్తి, బొమ్మగంటి బాలాజీ, తోరం వెంకన్నబాబు, మాదాసు వర్మ పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు నందు

ఇ.పి. నెం. 131/2015 ఇన్ ఒ.యస్. నెం. 1297/2013

బిట్వీన్:

అవుతు మధుసూదనరెడ్డి –డి. హెచ్. ఆర్.

మరియు

శ్రీమతి బొర్రా కృష్ణ వందన –జె.డి. ఆర్.

పై నెంబరు గ్రంథము నందు డిక్రీ బాకీ వగైరాలు వసూలు నిమిత్తము గాను యీ దిగువ షెడ్యూలు జె.డి.ఆర్. గారికి చెందిన ఆస్తిని **ది. 04-04-2024వ తేదీ ఉదయం గం|| 10.30 ని||ల** సమయం నుంచి పై కోర్టు వారి ఎదుట వేలం వేయుదురు. ఆసక్తి గల పాటదారులు వేలంలో పాల్గొనవచ్చును. మిగిలిన వివరాలకు కోర్టు నజారత్‌లో గాని, డి. హెచ్.ఆర్. గారి తరుపున న్యాయవాది గారిని గాని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

లోగడ పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు సబ్-డి., పెదవేగి మండలం, రామశింగవరం గ్రామపంచాయతీలో గల ఆర్.యస్. నెం. 88/3ఎ, 17ఎ నందలి య. 2-00 ట్లు వ్యవసాయ మెట్ట భూమికి హద్దులు.

తూర్పు: నడకదారి కొంత, కొడాలి రాఘవయ్య గారి భూమి కొంత మరియు తుంపాల అప్పారావు గారి భూమి కొంతవరకు. **దక్షిణం:** బొర్రా కృష్ణ వందన గారి భూమి. **పడమర:** బంగారు వెంకటేశ్వరరావు మరియు ఇ.రాము గార్ల భూమి. **ఉత్తరం:** మొహమ్మద్ షఫీవుల్లా గారి భూమి.

యీ హద్దుల మధ్య గల య. 2-00 ట్లు భూమిలో అనిర్దిష్టపు య. 1-00ట్లు భూమిని సమస్త యీజుమెంటరీ మరియు సర్వ హక్కులతో సహా వేలం వేయబడును.

డి. హెచ్.ఆర్. గారి విలువ: రూ. 8,00,000/-లు

జె.డి.ఆర్. గారి విలువ: పేర్కొనబడలేదు.

అమీనా గారి విలువ: రూ. 8,50,000/-లు

సబ్‌రిజిస్ట్రారు గారి మార్కెట్ విలువ రీత్యా ఎకరా 1కి రూ. 15,00,000/-లు విలువ కలిగి యున్నది. వేలం సమయమందు పాట ప్రారంభపు ధర కోర్టు వారు నిర్ణయించుదురు.

షెడ్యూలు ఆస్తి మీద ఎటువంటి ఎన్‌కంబరెన్సెస్ లేవు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గమనిక: షెడ్యూలు ఆస్తిని కోర్టు వారు జప్తు చేసిన పిదప జె.డి.ఆర్. అయిన బొర్రా కృష్ణ వందన ఆమె కుమార్తె అయిన ముదిరెడ్డి ప్రేమ తులసికు రిజిస్టర్డ్ దకలు దస్తావేజు నెం. 6433/2015రును వ్రాయించినారు. సదరు దఖలు దస్తావేజు చెల్లదు మరియు సదరు ముదిరెడ్డి ప్రేమ తులసి పై కోర్టు వారి ముందు దాఖలు చేసిన క్లయిమ్ అప్లికేషన్‌ను కోర్టు వారు డిస్‌మిస్ చేసియున్నారు. కావున షెడ్యూలు ఆస్తి మీద ఎటువంటి ఎన్‌కంబరెన్సెస్ లేవు.

శ్రీ కూరపాటి పృధ్వీరాజ్
శ్రీ గోళ్ళ గోవింద శ్రీచరణ్
అడ్వకేట్స్, ఏలూరు
సెల్: 9247163349, 8019826216

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), కొవ్వూరు వారి కోర్టులో

E.A. 23/2018, E.P. 110/2014
O.S. 86/1985

Between:

1. శ్రీమతి మండా సీతారత్నం, W/o. వెంకటరావు, స్త్రీ, 79 సం||లు, R/o. పెద్దాపురం, గోపాలపురం మండలం, KJCJC.

...DHr/ పిటీషనరు (వాది)

Vs

1. బూరుగుపలి బ్రహ్మానందం (died)
2. బూరుగుపల్లి సుబ్బారావు
3. బూరుగుపల్లి జనార్దనరావు
4. బూరుగుపల్లి సత్యప్రియ
5. బూరుగుపల్లి మోహనకుమార్
6. బూరుగుపల్లి మురళీకృష్ణ
7. చెరుకూరి లోకేశ్వరి

...JDr's/ రెస్పాండెంట్లు

(రెస్పాండెంట్లు R5 to R7 are added as LRS of Deceased 1st Respondent as per Orders in E.A. 16/2017, dt. 07-07-2017)

R3/ 3rd Respondent:

R-3: బూరుగుపల్లి జనార్దనరావు, S/o. రంగారావు, హిందూ, పురుషుడు, 46 సం||లు, వ్యవసాయం, కాలేజి రోడ్డు, R/o. జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, JRG JCJC.

పై నెంబరు E.A. 23/2018 పిటీషను, పిటీషను షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ఒప్పగింత కొరకు దాఖలు చేసినది అయివుండి, సదరు పిటీషను యందు R3 అయిన మీకు ఎన్నిమార్లు కోర్టు వారి ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికి వాటిని అందుకొనకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచూ వెనక్కి త్రిప్పి పంపించుచున్నందున పై కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం Substitute Service ద్వారా అమలు పరుచుట ద్వారా మీకు వాయిదా తెలియపరచడమైనది. పై నెంబరు E.A. 23/2018 పిటీషను యందు R3 అయిన మీరు **ది. 16-04-2024వ తేదీ ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. అట్లు లేనియెడల పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 16-04-2024

ఎన్.వి.సుబ్బారావు
అడ్వకేట్, కొవ్వూరు
కొవ్వూరు
14-3-24
సెల్:9440330449

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT :: Kovvur

I.A NO. OF 2023, I.A NO. 547 OF 2022, I.P. NO. 8 OF 2019

Between:

1. Madhavi Damage Saree Centre, Parimpudi Villge, Rep By Its Proprietor Amjuri Rambabu, S/O Pothuraju, Age 40 Years, Hindu, Business, D.No 23-115, Virodhulavari Street, Buttaaigudem Road, Jangareddigudem Village And Mandal.
2. Amjuri Rambabu, S/O Pothuraju, Age 40 Years, Hindu, Proprietor Of Madhavi Damage Saree Center, D.No 23-115 , Virodhula Vari Street, Jangareddigudem., ***...Petitioners***

AND

Sri. Rajanala Venkateswara Rao and 27 others ***...Respondents***

1. Rajanala Venkateswara Rao, S/O Not Known, Koyyalagudem Mandal.
2. Sheik Saleem, S/O Not Known, Jangareddigudem Mandal.
3. Bomma Krishna S/O Kot Known, Tadepalligudem Mandal.
4. Bomma Krishna, S/O Not Known, Koyyalagudem Mandal.
5. Attuluri Venkata Ramana, W/O Ammiraju, Koyyalagudem Mandal.
6. Parasa Satyanarayana, S/O Bhadram, Koyyalagudem Village and Mandal.
7. Tele Dharmaraju, S/O Not Known, Koyyalagudem Village And Mandal.
8. Sadhuboina Gaannemma W/O Narasimha Murthy, Koyyalagudem Mandal.
9. Suklaboina Rambubu, S/O Not Known, Koyyalagudem Village And Mandal.
10. Muttanaboina Ramalakshmi, W/O Bhadram, Koyyalagudem Village And Mandal.
11. Teeda Padma Lalitha Kumara, W/O Gangadhar, Jangareddigudem Village And Mandal.
12. Tadi Srinum, S/O Kot Known, Koyyalagudem Village And Mandal.
13. Sheik Galeed, S/O Not known, Koyyalagudem Mandal.
14. Ijjada Durga Rao, S/O Adiyya, Eluru, W.G.Dt,
15. Kodapaka Satyanarayana, S/O Viswanadham, Koyyalagude Mandal, W.G.Dt.
16. Pola Nagamma, W/O Somayya, Koyyalagudem Village And Mandal.
17. Kodapaka Nagamani, W/O Viswanadham, Koyyalagudem Mandal.
18. Kotikalapudi Satyavathi, W/O Satyanarayana, Koyyalagudem Village And Mandal.
19. Pandi Dasu,S/O Krishna Murthy, Koyyalagudem Village And Mandal.
20. Kokkandi Lakshmi, W/O Not Known, Koyyalagudem Mandal.
21. Muthanaboina Baburao, S/O Bhadra, Koyyalagudem Village And Mandal.
22. Attuluri Aammiraju, S/O Gangaraju, Koyyalagudem Village And Mandal.
23. Pilli Chandra Rao, S/O Not Known, Eluru Rural Mandal.
24. **Pilli Rajyam, W/O Rambabu, Aged 52 Years,Carpenter, Sankaramatam Road, Eluru, W.G.Dt.**
25. Challa Dharmaraju, S/O Anjaneyulu, Gopalapuram Mandal.
26. Tele Venkata Lakshmi, W/O Satyanarayana, Koyyalagudem Mandal.
27. Kalisetti Gowramma, W/O Satyam, Koyyalagudem Mandal.
28. The Official Receiver, West Godavari Dist, ELURU, ELR SCJC limits.

...RESPONDENTS

పై నంబరు క్రెడిటార్ ఇన్‌సాల్వెంట్ పిటిషన్‌ను పై కోర్టులో దాఖలు చేసియున్నారు. 24వ రెస్పాండెంట్‌కి జారీ చేసిన సమన్లు అందుకొనకపోవుట చేత శ్రీ కోర్టు వారు పబ్లికేషన్ ద్వారా సమను నోటీసు జారీ చేయమని ఆర్డరు వేసియున్నారు. కావున మీరు **ది. 23-03-2024వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్పు నిర్ణయించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

స్థలం: కొవ్వూరు
దివి. 14-03-2024

ఎన్.బి.కాంతిధర్
అడ్వకేట్/ పిటిషనర్

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, బొమ్మిడి గ్రామం, డోర్ నెం. 1-171/1 చెందిన కొప్పుల అనంత సత్యబాబు, S/o. కొప్పుల వెంకనన అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **V7811091** గల నా ఒరిజినల్ పాస్‌పోర్టును తీసుకొని ఉంగుటూరు నుండి తాడేపల్లిగూడెం పని నిమిత్తం పని ముగించుకొని నేను నా యింటికి తిరిగి వెళు తుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కొప్పుల అనంత సత్యబాబు
S/o. కొప్పుల వెంకన్న, డోర్ నెం. 1-171/1,
బొమ్మిడి గ్రామం, ఉంగుటూరు మండలం,
ఏలూరు జిల్లా, సెల్: 9951756400

ఏలూరు నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 4041/2012/ఎ1 — తేది.07-03-2024

బహిరంగ వేలము నోటీసు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ ఉదహరించిన వివిధ మన్సిపల్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా ఉన్న షాపు రూములు బహిరంగ వేలము ద్వారా కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56, తేది.05-02-2011 మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 198, తేది. 08-05-2012 నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య 76, తేది. 23-08-2014 ప్రకారము ఆదివారపు పేట, లవేటి అప్పలస్వామి మార్కెట్, మెయిన్ ఫిష్ మార్కెట్ షాపులను గుడ్ విల్ పద్ధతిపై కేటాయించుటకు మరియు బాపూజీ కాంప్లెక్స్, కందుల సూర్యం కాంప్లెక్స్ GF & FF, పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాక్, క్యాటిల్ డిపో మొదటి అంతస్తు, వంగాయగూడెం చేపలచెట్టు మార్కెట్, కస్తూరిభా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్-2 మరియు న్యూ ఫిష్ మార్కెట్ నందలి షాపులను అద్దె మొత్తముపై కేటాయించుటకు గాను తేది. 15-03-2024 శుక్రవారము మధ్యాహ్నం గం|| 3.00 నుండి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు బహిరంగ వేలము నిర్వహించుటకు నోటీసు జారీ చేయడమైనది.

గుడ్ విల్ పద్ధతిపై షాపులను కేటాయించుటకు:

వ.నెం.	కాంప్లెక్స్ పేరు	మొత్తము షాపులు	గుడ్ విల్	సాల్వెన్సీ
1	ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్	13	రూ.25,000/-	రూ.1,00,000/-
2	లావేటి అప్పలస్వామి మార్కెట్ కాంప్లెక్స్	14	రూ.25,000/-	రూ.1,00,000/-